సాక్షి అనంతపురం

మంగళవారం । 18 । జూలై । 2023



చీనీ టన్ను రూ.19 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.19 వేలు పలికాయి.



బంగారు కొండలు వీరే..

ఎస్కేయూ 21వ స్నాతకోత్సవంలో 2021-22 సంవత్సరానికి సంబంధించి ప్రతిభ కనబరచిన విద్యార్థులకు గవర్నర్ బంగారు పతకాలు అందజేశారు.

8లో

గరిష్ఠం/కనిష్ఠం

36.7°/21.9°

జిల్లాలో సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. నైరుతి దిశగా గాలులు గంటకు 8 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

లో ఓల్టేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం



మాట్లాడుతున్న సీఎండీ సంతోష్‌రావు

అనంతపురం టౌన్: విద్యుత్ లో ఓల్టేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా ఉమ్మడి జిల్లాలో 32 ప్రత్యేక సబ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు తెలిపారు. సోమవారం విద్యుత్ శాఖ కార్యాలయంలో గుత్తి, కళ్యాణదుర్గం సబ్ డివిజన్ల పరిధిలోని అధికారులతో సమీక్ష నిర్వహించారు. కళ్యాణదుర్గం, గుత్తి డివిజన్లలో కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణాల కోసం ప్రత్యేక నిధులు కేటాయించినట్లు తెలిపారు. దీంతో పాటు వ్యవసాయ కనెక్షన్ల దరఖాస్తులను పరిశీలించి వెంటనే మంజూరు చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఎస్ఈ సురేంద్రను ఆదేశించారు. మరమ్మతులకు గురైన విద్యుత్ లైన్ల పునరుద్ధరణను త్వరగా పూర్తి చేసే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ ప్రమాదాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫిర్యాదులు వేగవంతంగా పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఈఈలు శేషాద్రి, రాజశేఖర్‌తో పాటు ఏడీలు, ఏఈలు పాల్గొన్నారు.

పసికందులకు టీకా



నవజాత శిశువుకు టీకా వేస్తున్న నర్సులు

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో అప్పుడే జన్మించిన పసికందులకు జీరో డోస్ టీకాలు క్రమం తప్పకుండా అందజేస్తున్నారు. ఇందు కోసం గైనిక్ విభాగం ప్రొఫెసర్లు పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. ప్రసవం జరిగిన వారి జాబితా ఆధారంగా ప్రతి ఒక్కరినీ ట్రైనీ స్టాఫ్ నర్సులు కలసి జీరో డోస్ టీకాలపై అవగాహన కల్పించి, నవజాత శిశువులకు టీకాలు అందేలా కృషి చేస్తున్నారు. దీంతో రోజూ 20 నుంచి 30 మంది పసికందులకు బీసీజీ, పోలియో, హెపటైటీస్ బీ, విటమిన్ కే టీకాలు సకాలంలో అందుతున్నాయి.

జిల్లాకు చేరిన 1,300 మెట్రిక్ టన్నుల ఎరువు



ఎరువులను పరిశీలిస్తున్న అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ ఎరువుల ప్రణాళికలో భాగంగా నెలవారీ కోటా మేరకు సోమవారం స్పిక్ కంపెనీ నుంచి 1,300 మెట్రిక్ టన్నుల ఎరువులు జిల్లాకు అందినట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ ఎం.రవి తెలిపారు. స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్‌కు వ్యాగన్ల ద్వారా చేరుకున్న ఎరువులను ఆయన పరిశీలించారు. 664.65 మెట్రిక్ టన్నుల యూరియా, 443.65 మెట్రిక్ టన్నుల డీఏపీ, 127 మెట్రిక్ టన్నుల 20:20:0:13 రకం కాంప్లెక్స్ ఎరువులు, 63.85 మెట్రిక్ టన్నుల ఎస్ఎస్‌పీ జిల్లాకు అందినట్లు వివరించారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఏఓ ఆదేశాల మేరకు తొలి ప్రాధాన్యతగా ఆర్‌బీకేలు, సహకార సంఘాలకు సరఫరా చేసి, మిగిలినవి హోల్‌సేల్, ప్రైవేట్ డీలర్లకు అందజేస్తామన్నారు.

'పోలీసు స్పందన'కు 87 వినతులు



అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 87 వినతులు అందాయి. వినతులను ఎస్పీ కె.శ్రీనివాసరావు స్వయంగా స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. అనంతరం మీడియాతో ఎస్పీ మాట్లాడుతూ.. స్పందన కార్యక్రమంలో అందే ప్రతి అర్జీకి సంతృప్తికర పరిష్కారం చూపుతున్నట్లు పేర్కొన్నారు. 14 రోజుల్లోపు ప్రతి సమస్యకూ పరిష్కారం చూపుతున్నామన్నారు.



పట్టాలు అందుకోవడానికి వచ్చిన విద్యార్థులు



గోల్డ్‌మెడల్స్ అందుకున్న విద్యార్థుల ఆనంద హేల



ఎస్కేయూ క్యాంపస్‌లో రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్, చిత్రంలో హేమచంద్రారెడ్డి, వీసీ రామకృష్ణారెడ్డి, కలెక్టర్ గౌతమి, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

ప్రతిభకు పట్టాభిషేకం

- వైభవంగా ఎస్కేయూ 21వ స్నాతకోత్సవం
- మహంతేష్‌కు గౌరవ డాక్టరేట్, పలువురికి డాక్టరేట్ పట్టాలు
- ఎనిమిది మందికి గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకాలు
- ఉత్తేజపరిచేలా గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం

అనంతపురం : శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవ సంబరం అంబరమంటింది. భువన విజయం ఆడిటోరియంలో 21వ స్నాతకోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఏపీ గవర్నర్/యూనివర్సిటీ చాన్సలర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 2021-22 విద్యా సంవత్సరానికి సంబంధించి మొత్తం 9,150 మంది విద్యార్థులకు డిగ్రీలు సిద్ధం చేశారు. వీరిలో 90 మంది విద్యార్థులకు కార్యక్రమంలో డాక్టరేట్ పట్టాలు అందించారు. 44 మందికి గాను నేరుగా 8 మందికి గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకాలు అందజేశారు. గౌరవ డాక్టరేట్‌ను సమర్థనం ట్రస్టు ఫర్ ది డిజేబుల్డ్ వ్యవస్థాపక మేనేజింగ్ ట్రస్టీ, భారత మాజీ అంధ క్రికెటర్ మహంతేష్ జీ. కే గవర్నర్ చేతుల మీదుగా అందుకున్నారు.

ప్రముఖులు.. ప్రత్యేకతలు

- 20 ఏళ్ల తర్వాత గవర్నర్ ఎస్కేయూకు రావడం గమనార్హం. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ స్నాతకోత్సవంలో ఉత్తేజపూరితమైన ప్రసంగం చేశారు.
- యూనివర్సిటీలో పలు అభివృద్ధి కార్యక్రమాలను గవర్నర్ ప్రారంభించారు. వర్సిటీలోకి ప్రవేశించిన అనంతరం తొలుత క్యాంపస్‌లోని శ్రీకృష్ణదేవరాయ విగ్రహానికి నివాళి అర్పించారు. అనంతరం ఇంజినీరింగ్ కళాశాలలో నూతన అకడమిక్ భవనాన్ని, కొత్తగా నిర్మించిన తారు రోడ్డు, ఇంజినీరింగ్ కళాశాల మెన్స్‌హాస్టల్ భవనాలను గవర్నర్ ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎం.గౌతమి, ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి, ఎస్కేయూ రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, సీఈఓ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- గవర్నర్ రాక నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రత కల్పించారు. నిర్వహణ కమిటీలు సమర్థవంతంగా పనిచేయడంతో నిర్దేశించిన సమయానికే స్నాతకోత్సవం ప్రారంభమై విజయవంతంగా సాగింది.

వేదిక ముందు...

యూపీఎస్సీ మాజీ సభ్యుడు ప్రొఫెసర్ వై.వెంకట్రామిరెడ్డి, జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన, మేయర్ వసీం, ఎస్కేయూ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రాజూరి రామకృష్ణారెడ్డి, ఏపీ నాటక అకాడమీ చైర్‌పర్సన్ రాగే హరిత తదితరులు ఆసీనులయ్యారు.

విద్యార్థులే బ్రాండ్ అంబాసిడర్లు..

గ్రాడ్యుయేట్లు, డాక్టరేట్లు, బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు యూనివర్సిటీకి బ్రాండ్ అంబాసిడర్లు అని ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. అధ్యాపకుల అకడమిక్ ఎక్సలెన్స్, అచంచలమైన అంకితభావానికి నిదర్శనమే గ్రాడ్యుయేట్‌ల పురోగతి అని అభివర్ణించారు. గొప్ప పాలకుడు, మహనీయుడైన శ్రీకృష్ణదేవరాయలు పేరుతో ఏర్పడిన ఎస్కేయూనివర్సిటీ 29 విభాగాల ద్వారా 37 పీజీ కోర్సులు అందిస్తోందన్నారు. 88 అనుబంధ డిగ్రీ కళాశాలలు, 16 పీజీ కళాశాలలు కొనసాగుతున్నాయన్నారు. 2020-21 విద్యా సంవత్సరం నుంచి నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీ ప్రోగ్రామ్‌ను ప్రవేశపెట్టామని, యూజీ స్థాయిలో నూతన పాఠ్యప్రణాళిక అమలు చేస్తున్నామని వివరించారు. 2021-22 ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో ఎస్కేయూ 150-200 మధ్యన నిలిచిందన్నారు. అటల్ ఇంక్యుబేషన్ కేంద్రం ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అద్భుతమైన అవకాశం కల్పిస్తున్నామని, ఇప్పటికే 35 స్టార్టప్ కంపెనీలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఔత్సాహిక పారిశ్రామిక హబ్‌గా మారుతుందన్నారు.



ఎస్కేయూ 21వ స్నాతకోత్సవంలో మహంతేష్ జీకేకు గౌరవ డాక్టరేట్‌ను అందజేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

బోధన, పరిశోధన, విస్తరణలో ఎస్కేయూకు మంచి గుర్తింపు

- గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి బోధన, పరిశోధన, విస్తరణలో మంచి గుర్తింపు ఉందని ఏపీ గవర్నర్, యూనివర్సిటీల చాన్సలర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. ఎస్కేయూ 21వ స్నాతకోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. రాష్ట్రీయ ఉచ్చతార్ శిక్షా అభియాన్ నిధులు వినియోగించి వర్సిటీలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేశారని ప్రశంసించారు. జాతీయ సేవా పథకం అమలులో వర్సిటీ ప్రత్యేకంగా నిలుస్తుందన్నారు. అటల్ ఇంక్యుబేషన్ కేంద్రం ద్వారా స్టార్టప్ కంపెనీలు, వినూత్న ఆవిష్కరణలకు దన్నుగా నిలుస్తుండడం అభినందనీయమన్నారు. స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ స్కీం కింద అటల్ ఇంక్యుబేషన్ కేంద్రం అర్హత సాధించడం సంతోషదాయకమన్నారు. గ్రామీణ ప్రాంత ఆవిష్కరణలకు, సుస్థిరాభివృద్ధిని పెంపొందించడానికి భవిష్యత్తులో నోడల్ సెంటరుగా ఆవిర్భవించాలని ఆకాంక్షించారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సహకారంతో అత్యాధునిక వాతావరణ పరిశోధన ప్రయోగశాల కలిగి ఉండడం విశేషమన్నారు. నూతన ఆవిష్కరణలు, ఔత్సాహిక పారిశ్రామిక విధానం, పర్యావరణ వ్యవస్థను పెంపొందించడంలో ఎస్కేయూ రాబోవు రోజుల్లో మంచి వేదిక కానుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

గౌరవ డాక్టరేట్ అపురూపం

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ అందుకోవడం అపురూప ఘట్టమని సమర్థనం ట్రస్టు ఫర్ ది డిజేబుల్డ్ వ్యవస్థాపక మేనేజింగ్ ట్రస్టీ, భారత మాజీ అంధ క్రికెటర్ మహంతేష్ జీ.కే. అన్నారు. సోమవారం ఎస్కేయూ 21వ స్నాతకోత్సవం సందర్భంగా గౌరవ డాక్టరేట్‌ను ఆయన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'శ్రీకృష్ణదేవరాయల చక్రవర్తికి గొప్ప ప్రాముఖ్యత ఉంది. కన్నడ రాజ్య రమణ, మూర్ రాయర గండ, ఆంధ్రభోజ తదితర బిరుదులతో విజయనగర సామ్రాజ్యాన్ని పాలించారు. శ్రీకృష్ణదేవరాయలు నైపుణ్యం కలిగిన సైనిక వ్యూహకర్త మాత్రమే కాదు కళలు, సాహిత్యం, వాస్తు శిల్పానికి పోషకుడు కూడా. ఆయన విజయనగర సామ్రాజ్య స్వర్ణ యుగానికి ప్రతీక. ఆయన వారసత్వం నేటికీ ప్రతిధ్వనిస్తుంది. రెండు రాష్ట్రాల మధ్య అంతరాన్ని తగ్గించి మన భాగస్వామ్య వారసత్వ సంపదను ప్రదర్శిస్తుంది. అటువంటి గొప్ప పాలకుడి పేరుతో ఉన్న శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నా'నన్నారు. దివ్యాంగుల జీవితాల్లో వెలుగు నింపడమే తమ సమ్మర్థనం ట్రస్టు కర్తవ్యమన్నారు. ప్రత్యేక బోధన, సహాయక సాంకేతికతలు, సమ్మిళిత విద్యా వాతావరణం సృష్టించడం, అడ్డంకులను విచ్ఛిన్నం చేసి దివ్యాంగుల్లో విద్యను పెంపొందించి, జీవనోపాధి కల్పించే దిశగా ప్రయత్నాలు సాగిస్తున్నామన్నారు.



పట్టా అందుకున్న అన్నను అభినందిస్తున్న సోదరి



భువన విజయం ఆడిటోరియంలోకి వస్తున్న యూనివర్సిటీ అధికారులు





హాజరైన ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, నాటక అకాడమీ చైర్‌పర్సన్ హరిత, యూపీఎస్సీ మాజీ సభ్యుడు వై.వెంకట్రామిరెడ్డి, జేఎన్‌టీయూ వీసీ రంగ జనార్దన

ఐసీడీఎస్‌లో ఆధిపత్య పోరు

- ఇన్‌చార్జ్ పీడీ వర్సెస్ సీడీపీఓల మధ్య కోల్డ్‌వార్
- సమన్వయం చేసుకోవడంలో విఫలం
- అంగన్‌వాడీల నూతన భవన నిర్మాణాల్లో కనిపించని పురోగతి
- ఖాళీల నోటీఫికేషన్లలోనూ తప్పుల తడకలే
- డైరెక్టరేట్‌కు వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు



అనంతపురం సెంట్రల్: మహిళా, శిశు సంక్షేమ శాఖలో ఆధిపత్య పోరు కొనసాగుతోంది. క్షేత్ర స్థాయిలో పనిచేసే సీడీపీఓలను సమన్వయం చేసుకోవడం పక్కన పెడితే వారిపై పెత్తనం చెలాయించేందుకు జిల్లా ఇన్‌చార్జ్ అధికారి తహతహలాడుతుండడంతో వారి మధ్య నిశ్శబ్ద యుద్ధం సాగుతోంది. సమయం దొరికినప్పుడల్లా ఇరుకునపెట్టేందుకు ఒకరిపై ఒకరు ప్రయత్నాలు చేస్తుండడంతో ఐసీడీఎస్ పరువు కాస్త బజారున పడుతోంది.

ఇరుకున పెట్టే చర్యలతోనే అసలు సమస్య..

జిల్లా ఉన్నతాధికారిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత అందరినీ సమన్వయం చేసుకుంటూ ఐసీడీఎస్ కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయడంలో వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. తన ఆధిపత్యం కోసం సీడీపీఓలను జిల్లా ఉన్నతాధికారుల వద్ద ఇరుకున పెట్టి లబ్ధిపొందాలనే ఉద్దేశంతో ఇన్‌చార్జ్ అధికారి వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇటీవల జరిగిన కలెక్టర్, ఆర్జేడీ సమీక్షా సమావేశాలే ఇందుకు నిదర్శనంగా నిలిచాయి. జిల్లాలోని 91 అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం నూతన భవనాల నిర్మాణాలు మంజూరు చేస్తే ఒక్కటంటే ఒక్కటి పునాది స్థాయి దాటి ముందుకు సాగడం లేదు. ఈ అంశంపై ఇన్‌చార్జ్ అధికారి ఏనాడూ క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించలేదు. అంతేకాక ఈ తప్పిదాన్ని పూర్తిగా సీడీపీఓలపై నెట్టేయడం విమర్శలకు దారి తీస్తోంది. అంగన్‌వాడీకి సంబంధించిన నోటిఫికేషన్‌ల జారీలో సైతం తప్పుల తడకగానే ఉంటున్నాయనే విమర్శలున్నాయి. రోస్టర్‌ను ఇష్టానుసారంగా మారుస్తారని, అడ్డుపడితే అనవసర ఇబ్బందులకు గురి చేస్తున్నారని సీడీపీఓలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీని వల్ల భవిష్యత్తులో కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి వస్తుందని భయపడుతున్నారు.

డైరెక్టరేట్‌కు ఫిర్యాదులు..

పూర్తి పెత్తనం కాంట్రాక్టు సిబ్బందికి అప్పగించి రెగ్యులర్ సిబ్బందిని ఇరుకున పెట్టేలా జిల్లా ఇన్‌చార్జ్ అధికారి వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా కిందిస్థాయి సిబ్బంది నేరుగా ఆర్జేడీ, రాష్ట్ర డైరెక్టరేట్‌కు ఫిర్యాదు చేస్తున్నారు. మిషన్ వాత్సల్య పథకంలో చోటు చేసుకున్న అక్రమాలపై ఇటీవల కర్నూలు ఆర్జేడీ పద్మజ విచారణకు రావాల్సి వచ్చారంటే పరిస్థితి ఎంతకు దిగజారిందో అర్థం చేసుకోవచ్చు. కేవలం మెప్పు పొందేందుకు నిబంధనలకు పాతరేస్తున్నారని, ఇలాగైతే తాము పనిచేయలేమని పలువురు సీడీపీఓలు పేర్కొంటున్నారు.

ప్రభుత్వం మేలు చేస్తున్నా.. తప్పని ఇబ్బందులు

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల విషయంలో గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకొచ్చింది. గత టీడీపీ ప్రభుత్వంలో వర్కర్లకు రూ.7వేలు, హెల్పర్లకు రూ.4,500 మాత్రమే వేతనాలు ఇచ్చేవారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే వర్కర్‌లకు రూ.11,500, హెల్పర్‌లకు రూ. 7వేలకు వేతనాలు పెంచారు. ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేయాలని ఆదేశించడంతో ఈ ప్రభుత్వ హయాంలోనే దాదాపు ఆరు నోటిఫికేషన్లు వెలువడ్డాయి. అంతేకాక పదేళ్ల సర్వీసు దాటిన అంగన్‌వాడీ కార్యకర్తలకు సూపర్‌వైజర్లుగా ప్రమోషన్లు కల్పించారు. అయితే జిల్లా ఇన్‌చార్జ్ అధికారి పని తీరుతో అంగన్‌వాడీ సిబ్బంది ఇబ్బందులు పడే పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీ సమయంలో అర్హులైన హెల్పర్లకు అవకాశం కల్పించకపోవడం ఇందుకు నిదర్శనం. అలాగే కేంద్రాల నిర్వహణకు రూ.వేలకు వేలు ఖర్చు చేస్తున్నా, బిల్లులు మాత్రం మంజూరు చేయడం లేదు. జిల్లా ఇన్‌చార్జ్ ఉన్నతాధికారి తీరుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలువురు అంగన్‌వాడీ సిబ్బంది వాపోతున్నారు.

ఫీవర్ సర్వే పక్కాగా చేయాలి

- డీఎంహెచ్ఓ యుగంధర్

అనంతపురం క్రైం: ఫీవర్ సర్వే పక్కాగా చేపట్టాలని డీఎంహెచ్ఓ డాక్టర్ యుగంధర్ పీహెచ్‌సీ వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో వైద్యాధికారులకు యూ-విన్ పోర్టల్, ప్రభుత్వ కార్యక్రమాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ జ్వరం లక్షణాలు కన్పించిన వారికి డెంగీ, మలేరియా పరీక్షలు చేసి, పాజిటివ్ నమోదైన ప్రాంతాల్లో దోమకాటు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. గర్భిణులు, పసికందులకు టీకాలు తప్పనిసరిగా అందేలా చూడాలన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ విజయవంతం చేయాలన్నారు. సిబ్బంది అందరూ సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సుజాత, డాక్టర్ చెన్నకేశవులు, డాక్టర్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు తప్పవని స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులను డీఎంహెచ్ఓ యుగంధర్ హెచ్చరించారు. సోమవారం మారుతీ నగర్‌లోని హర్షిత, రాంనగర్‌లోని కేసీ రామన్న, సాయినగర్‌లోని శిత్ర ఆస్పత్రుల్లో ఉన్న స్కానింగ్ సెంటర్లను డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ చేశారు. లింగ నిర్ధారణ చట్టానికనుగుణంగా స్కాన్ సెంటర్ నిర్వాహకులు నడుచుకోవాలన్నారు. డీఎంహెచ్ఓ వెంట డెమో ఉమాపతి, డిప్యూటీ డెమో త్యాగరాజు, గంగాధర్, తదితరులున్నారు.



స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ యుగంధర్

ర్యాంకింగ్ కోసం సౌకర్యాల పరిశీలన

బత్తలపల్లి: ఉత్తమ పోలీసు స్టేషన్ల గుర్తింపులో భాగంగా కేంద్ర బృందం సోమవారం బత్తలపల్లి పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసింది. కలయ అరసన్ నేతృత్వంలోని సభ్యులు స్టేషన్‌లోని వివిధ రికార్డులను పరిశీలించారు. వాటిని ఏవిధంగా భద్రపరుస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో వివిధ విభాగాలు, వాటిని నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. స్టేషన్ చుట్టూ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్‌లో రికార్డుల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, మౌలిక వసతులు పరిశీలించారు. వివిధ సమస్యలతో పోలీసు స్టేషన్‌కు వచ్చిన వారినీ, స్టేషన్ సిబ్బందిని పలకరించి వివరాలు అడిగి తెలుసుకునే ప్రయత్నం చేశారు. అనంతరం కేంద్ర బృందం సభ్యుడు కలయ అరసన్ విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు తాము దేశమంతా పర్యటిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే ఉమ్మడి చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో పర్యటిస్తున్నమన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ టీవీ శ్రీహర్ష, ఏఎస్ఐ సోమశేఖర్‌మూర్తి, పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



బత్తలపల్లి పోలీస్ స్టేషన్‌లో పరిసరాలను పరిశీలిస్తున్న కలయ అరసన్

అదనపు భవన నిర్మాణాలకు గవర్నర్ శంకుస్థాపన


లైబ్రరీ, మూట్ కోర్టు భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

అనంతపురం: జిల్లా కేంద్రంలోని విజయనగర లా కాలేజీలో పీజీ కోర్సుకు సంబంధించి లైబ్రరీ, మూట్ కోర్టు అదనపు భవన నిర్మాణాలకు రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ సోమవారం శంకుస్థాపన చేశారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం ముగిసిన అనంతరం విజయనగర లా కళాశాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు, సిబ్బంది గవర్నర్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులతో గవర్నర్ కాసేపు ముచ్చటించారు. న్యాయశాస్త్రం బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, ఎస్కేయూ వీసీ ఆచార్య మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి, విజయనగర లా కళాశాల ఫౌండర్ చైర్మన్ ఆలూరు రామిరెడ్డి, కరస్పాండెంట్ శ్రీనివాసరెడ్డి, అనంతపురం ఆర్డీఓ మధుసూదన్, ప్రిన్సిపాల్ డాక్టర్ రాఘవేంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

బంగారు కొండలు వీరే..


గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి బంగారు పతకాన్ని అందుకుంటున్న జి.లలిత


వైదేహి లలిత జి.మహాదేవి


పూజిత ఎం.తేజస్విణి ఎం.నీలఫర్ భాను

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మొత్తం 44 మంది బంగారు పతకాలు అందజేశారు. వీరిలో 8 మందికి పతకాలను గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ స్వయంగా అందజేశారు. మిగిలిన వారికి ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి అందజేశారు. తెలుగు విభాగంలో శ్రీ తూమటి దోనప్ప పల్నాడు గోల్డ్ మెడల్‌ను జె.యోగేశ్వరనాయుడు, ఇంగ్లిష్ విభాగంలో మువ్వా వెంకటలక్ష్మి రామశర్మ గోల్డ్ మెడల్‌ను గజేంద్రదాస్ నైరితాదాస్, అప్లైడ్ ఎకనామిక్స్ విభాగంలో ప్రొఫెసర్ ఎస్.సుబ్బరామయ్య గోల్డ్‌మెడల్‌ను బలిజ అమృతలక్ష్మి, ఎకనామిక్స్ విభాగంలో వై.ఎస్ రాజారెడ్డి గోల్డ్‌మెడల్‌ను సన్నా ఓబయ్యగారి వెంకటేసులు, ఎంఈడీ విభాగంలో పి.మురళీధరుడు గోల్డ్‌మెడల్‌ను బి.కాత్యాయిని, సోషల్‌వర్క్ విభాగంలో బి.నాగభూషణం గోల్డ్‌మెడల్‌ను బోయ త్రివేణి, పొలిటికల్ సైన్స్ విభాగంలో ఐదుకల్లు సదాశివన్ గోల్డ్‌మెడల్‌ను ఎస్.అన్నపూర్ణ, రూరల్ డెవలప్‌మెంట్ విభాగంలో ఎస్.శ్రీదేవి గోల్డ్‌మెడల్‌ను ఎ.ప్రసన్న భారతి, సోషియాలజీ విభాగంలో శ్రీ పరిటాల హరి గోల్డ్‌మెడల్‌ను పి.సమరసింహారెడ్డి, ఎంఎల్ఐఎస్సీ విభాగంలో ఓంకార జానకీబాయి నాగేశ్వరరావు గోల్డ్‌మెడల్‌ను, ప్రొఫెసర్ పి.కామయ్య గోల్డ్‌మెడల్‌ను ఎం.నాగవేణమ్మ, వై.జ్యోతి, హిస్టరీ విభాగంలో ఆర్.వసంత గోల్డ్ మెడల్‌ను పి.ఇమామ్ హుస్సేన్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో నీలం రాజశేఖరరెడ్డి గోల్‌మెడల్‌ను బి.నరేష్, కామర్స్ విభాగంలో తరిమెల జానకమ్మ గోల్డ్‌మెడల్‌ను డి.ప్రియాంక, ఎంబీఏ, ఎంబీఏ ఫైనాన్స్, హెచ్ఆర్ మేనేజ్‌మెంట్ విభాగాలలో కె.వెంకటరెడ్డి గోల్డ్‌మెడల్, క్యాపిటల్ ఐక్యూ గోల్డ్‌మెడల్, పి.సుబ్బారావు గోల్డ్‌మెడల్‌ను వి.లిఖిత, వి.హేమలత, మాస్టర్ ఆఫ్ లా విభాగంలో పరిటాల శ్రీరాములు గోల్డ్‌మెడల్‌ను కె.ఎస్ భవాని ఐశ్వర్య, కెమిస్ట్రీ విభాగంలో వైఎస్ జయమ్మ రాజారెడ్డి గోల్డ్‌మెడల్, ప్రొఫెసర్ ఎస్.బ్రహ్మాజీరావు గోల్డ్‌మెడల్‌ను పి.హిమబిందు, కంప్యూటర్ సైన్స్ విభాగంలో మారెళ్లపూడి సూర్యనారాయణమూర్తి గోల్డ్‌మెడల్‌ను ఎం.శ్రావణి, ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగంలో డీవీఎస్ రాజు గోల్డ్‌మెడల్‌ను ఆర్.శ్రీలక్ష్మి, ఎంసీఏ విభాగంలో గోరంట్ల సిద్దమ్మ గోల్డ్‌మెడల్‌ను జి.సాయిభార్గవి, ఎంపీఈడీ విభాగంలో పీఎల్ఎన్ రెడ్డి గోల్డ్‌మెడల్‌ను యు.చిన్నమధు, అప్లైడ్ మేథమెటిక్స్, మేథమెటిక్స్ విభాగంలో డి.వి కృష్ణా గోల్డ్‌మెడల్, డీఆర్‌వీ ప్రసాద్‌రావు గోల్డ్‌మెడల్‌ను ఈడిగ భువనేశ్వరి, ఎన్.గౌతమి, ఫిజిక్స్ విభాగంలో టి.వి.రామకృష్ణారావు గోల్డ్‌మెడల్, ఆర్.రామకృష్ణారెడ్డి గోల్డ్‌మెడల్‌ను సి.జ్ఞానేంద్ర, డీజీ శ్రావణి, పాలిమర్ సైన్స్ విభాగంలో ఎ.కామేశ్వరరావు గోల్డ్‌మెడల్‌ను, ఎ.చొడోజీరావు గోల్డ్‌మెడల్‌ను ఎస్.అఖిల్‌రెడ్డి, వై.సుష్మా, మైక్రో బయాలజీ విభాగంలో వి.రంగస్వామి గోల్డ్‌మెడల్, మహమ్మద్‌బాషా మొహిద్దీన్ గోల్డ్‌మెడల్‌ను షేక్ రేష్మాబేగం (రెండు), బయోటెక్నాలజీ విభాగంలో పరిటాల రవీంద్ర గోల్డ్‌మెడల్‌ను పి.చందన, జువాలజీ విభాగంలో వి.పర్వతేశ్వరరావు గోల్డ్ మెడల్‌ను సాకే సంధ్యారాణి, బాటనీ విభాగంలో టి.పుల్లయ్య గోల్డ్‌మెడల్‌ను ఎ.హరిత, సెరికల్చర్ విభాగంలో ప్రొఫెసర్ ఎస్.శంకర్‌నాయక్ గోల్డ్‌మెడల్‌ను కె.లలిత, జియోగ్రఫీ విభాగంలో వై.మంజుల, వైవీ రమణయ్య గోల్డ్‌మెడల్‌ను ఎం.సాంబశివుడు, ఈఈఈ విభాగంలో ద్వారకామయి డి.వెంకటరాజు గోల్డ్‌మెడల్‌ను షేక్ షఫియా సుల్తానాతాజ్ అందుకున్నారు.


ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య హేమచంద్రారెడ్డి, ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా బంగారు పతకంతో పాటు పట్టాలను అందుకుంటున్న లక్ష్మి


శ్రావణ సంధ్య అరుణ్‌కుమార్ ఎ.గౌతమి సంఘమిత్ర వి.లావణ్య కె.సాయిరాం ప్రసాద్ సయ్యద్ జమీరా


వై.మేఘన డి.అనిల్‌కుమార్ సుష్మ రుక్సానా బేగం ఎం.ఆశ్రిత సోనీ వంశీకృష్ణ


పి.ప్రమీల షేక్ షహరాభాను హేమలత అఖిల మౌనిక రామాంజినమ్మ


నిరోషా ఎం.సాయి ప్రకాష్ దివ్యశ్రీ శ్రీనివాసులు మాలిక్ బాషా బి.స్వాతి రుక్సానా బేగం షేక్ ఇమాం ఖాసీం కె.చాందిని

కౌన్సెలింగ్‌కు హాజరుకండి

పుట్టపర్తి: బుక్కపట్నంలో డైట్ కళాశాలలో చేపట్టిన మొదటి దశ కౌన్సెలింగ్‌కు అర్హులైన అభ్యర్థులు హాజరు కావాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ పిలుపునిచ్చారు. ఈ నెల 20వ తేదీ లోపు మొదటి దశ కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. ప్రొవిజినల్ అలాట్‌మెంట్ ఆర్డర్ పొందిన అభ్యర్థులు సరైన ధ్రువీకరణ పత్రాలతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు.

కుమారుడిపై కత్తితో దాడి

గుత్తి రూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో కుమారుడిపై తండ్రి కత్తితో దాడి చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి మండలం జక్కలచెరువుకి చెందిన బాలన్న మద్యానికి బానిస. ఆదివారం అర్ధరాత్రి మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న బాలన్నను కుమారుడు వెంకటేష్ మందలించాడు. ఆ సమయంలో ఆగ్రహానికి లోనైన బాలన్న కత్తి తీసుకుని దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన వెంకటేష్‌ను కుటుంబసభ్యులు వెంటనే గుత్తి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి ఆత్మహత్య

గార్లదిన్నె: జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గార్లదిన్నె నివాసి నాగరాజు (57)కు భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంత కాలంగా టీబీ వ్యాధితో బాధపడుతున్న నాగరాజు చికిత్స చేయించుకుంటున్నాడు. అయితే జబ్బు నయం కాకపోవడంతో మనస్తాపం చెందిన ఆయన సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు పరిశీలించి, కేసు నమోదు చేశారు.

గడువుకు ముందే అర్జీలు పరిష్కరించండి

- ఏ దశలోనూ జాప్యం జరగకూడదు
- అధికారులకు జేసీ కేతన్‌గార్గ్ ఆదేశం

అనంతపురం అర్బన్: స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాలకు అందే అర్జీలకు నిర్దేశిత గడువులోపు పరిష్కారం చూపాలని అధికారులను జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వివిధ సమస్యలపై 448 వినతులు అందాయి. జాయింట్ కలెక్టర్‌తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, డీఆర్వో గాయత్రీదేవి, మెప్మా పీడీ విజయలక్ష్మి, డిప్యూటీ కలెక్టర్ శంకరయ్య, జేడీఏ ఉమామహేశ్వరమ్మ అర్జీలు స్వీకరించారు. అనంతరం స్పందన అర్జీల పరిష్కారంపై అధికారులతో జేసీ సమీక్షించారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా వారి సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపించాలన్నారు. లేకపోతే అర్జీ రీ-ఓపెన్ అవుతుందన్నారు. ఈ క్రమంలో ఏ దశలోనూ జాప్యానికి తావివ్వకూడదన్నారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.


అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

వినతులు కొన్ని...

- డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో సీట్లు పెంచేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నపెద్దన్న, రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు రమణ, నాయకులు సంజీవులు, లక్ష్మీనారాయణ తదితరులు విన్నవించారు. అలాగే విద్యాహక్కు చట్టం కింద ప్రైవేటు విద్యాసంస్థల్లో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు ఉచితంగా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.
- ఏళ్లగా సాగు చేసుకుంటున్న భూమికి పట్టా ఇప్పించాలని బొమ్మనహాళ్ మండలం హెలంజీ గ్రామానికి చెందిన లాల్‌బీ విన్నవించింది. నిరుపేద ముస్లిం సామాజిక వర్గానికి చెందిన తమ కుటుంబానికి ఆ భూమే జీవనాధారమని పేర్కొంది.
- హౌస్ హోల్డింగ్ మ్యాపింగ్‌లో తమ కుటుంబానికి సంబంధం లేని ఇద్దరు వ్యక్తులను చేర్చారని విడపనకల్లు మండలం గడేకల్ గ్రామానికి చెందిన కె.కార్తీక్ ఫిర్యాదు చేశాడు. ఇదే విషయంపై పలుమార్లు మండల అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందని, దీనిపై విచారణ జరిపించి వారి పేర్లను తొలగించాలని కోరాడు.
- గతంలో ప్రభుత్వం తమకు డి.పట్టా ఇచ్చిన భూమిని రెవెన్యూ అధికారులు రద్దు చేసి దివ్యాంగులకు పట్టాలిచ్చారని, ఈ విషయంగా తనకు న్యాయం కోరుతూ కుందుర్పికి చెందిన కురుబ హరీష్‌కుమార్ వినతి పత్రం అందజేశాడు. అయితే తన సమస్యకు న్యాయమైన పరిష్కారం దక్కుతుందో లేదోనన్న ఆందోళనతో అర్జీ ఇచ్చే ముందు ఆయన నిద్రమాత్రలు మింగాడు. మగత కారణంగా క్యూలైన్‌లో కుప్పకూలాడు. విషయాన్ని గమనించిన కానిస్టేబుల్ అతని ద్వారా జేసీకి అర్జీ ఇప్పించి విషయం ఆరా తీసి, వెంటనే ఆస్పత్రికి తరలించారు.

గవర్నర్‌కు ఘన వీడ్కోలు

అనంతపురం: ఆర్అండ్‌బీ అతిథి గృహంలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ఎం.రామలక్ష్మి, నాటక అకాడమీ చైర్‌పర్సన్ హరిత సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుగు ప్రయాణంలో పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. కలెక్టర్ ఎం.గౌతమి, ఎస్పీ కె.శ్రీనివాసరావు జ్ఞాపికను అందించారు. జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, అనంతపురం ఆర్డీఓ మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.


గవర్నర్ అబ్దుల్‌నజీర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్ ఎం.గౌతమి, జిల్లా అధికారులు


పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ తలారి రంగయ్య


హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్


రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి


గవర్నర్‌కు శాలువా కప్పి సన్మానించిన ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

క్లుప్తంగా

గవర్నర్‌ను కలిసిన ఎంపీ రంగయ్య

అనంతపురం క్రైం: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ఎంపీ తలారి రంగయ్య ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు ఆయన పుష్పగుచ్ఛం అందించి, స్వాగతం పలికారు.

నేడు తలుపూరులో జగనన్న సురక్ష

ఆత్మకూరు: మండలంలోని తలుపూరు గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయ్ ప్రసాద్ సోమవారం తెలిపారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని పిలుపునిచ్చారు.

వంద రోజుల పని దినాలు పూర్తి చేయాలి



వడ్డుపల్లి వద్ద ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ అనురాధ

ఆత్మకూరు: ఉపాధిహామీ కూలీలు వందరోజుల పనిదినాలను పూర్తి చేయాలని ఏపీడీ అనురాధ తెలిపారు. సోమవారం మండలంలోని వడ్డుపల్లి వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఏపీడీ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు బిల్లులు అందుతున్నాయని తెలిపారు. అనంతరం కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీఓ సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో కరెంటు సరఫరాకు అంతరాయం



ఓపీ కోసం బారులు తీరిన మహిళలు

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో సోమవారం అధికసార్లు కరెంటు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పాత భవనంలోని గైనిక్, లేబర్, ఆపరేషన్ థియేటర్, తదితర ప్రాంతాల్లో కరెంటు సరఫరాకు ఇబ్బంది కలగడంతో సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు స్పందించారు. సకాలంలో జనరేటర్లను ఆన్ చేసేలా ఇన్‌చార్జ్ ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, అసిస్టెంట్ ఆర్ఎంఓ డాక్టర్ అభిషేక్‌ను ఆదేశించారు. దీంతో అందుబాటులో ఉన్న జనరేటర్ల ద్వారా రోగులు ఇబ్బందులు గురికాకుండా చర్యలు తీసుకున్నారు. ఓపీ స్లిప్‌ల మంజూరులో కాసింత జాప్యం జరిగింది.

సీఎంకు రుణపడి ఉంటాం

రాప్తాడు: గత 12 ఏళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న సీఆర్పీలను సీఆర్ఎంటీలుగా గుర్తించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటామని రాప్తాడు, గొందిరెడ్డిపల్లి, గాండ్లపర్తి క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు గంగప్ప, నాగభూషణ, రామాంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జీఓ 65 విడుదల చేసి, క్లస్టర్ మొబైల్ టీచర్‌గా గుర్తింపు ఇచ్చినందుకు ఆనందంగా ఉందని అన్నారు. ఉపాధ్యాయులు తరహాలోనే తమకు కూడా మినిమం టైం స్కేల్ వర్తింపజేయాలని కోరారు.

దివ్యాంగుల ధర్నా



రైల్వే స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

అనంతపురం సిటీ: అనంతపురం రైల్వే స్టేషన్ ఎదుట దివ్యాంగులు సోమవారం నిరసనకు దిగారు. రాయితీ పాసుల కోసం మూడు వారాలుగా తిరుగుతున్నా సంబంధిత అధికారి అందుబాటులో లేకుండాపోవడంతో విసుగెత్తి ఆందోళనకు దిగారు. ఉమ్మడి జిల్లాకు చెందిన వందలాది మంది దివ్యాంగులు రాయితీ పాసుల కోసం రోజూ అనంతపురం రైల్వే స్టేషన్‌కు రావడం, అధికారి లేక నిరాశతో వెనుదిరగడం పరిపాటిగా మారిందని ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి, అనంత దివ్యాంగుల సేవా సమితి ప్రతినిధులు హరినాథరెడ్డి, ఆంజనేయులు, రామాంజి ఆవేదన వ్యక్తం చేశారు. అనంతపురం రైల్వే స్టేషన్‌లో దరఖాస్తు చేసుకుంటేనే గుంతకల్లులో రాయితీ పాస్ ఇస్తారని, లేదంటే లేదని వాపోయారు. సమస్య పరిష్కరించకుంటే గుంతకల్లులోని రైల్వే డీఆర్ఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.

ఘనంగా మహేశ్వరి దేవి జయంత్యుత్సవాలు

చెన్నేకొత్తపల్లి: మండలంలోని న్యామద్దల గ్రామంలో గ్రామ దేవత మహేశ్వరిదేవి జయంత్యుత్సవాలను గ్రామస్తులు సోమవారం ఘనంగా జరిపారు. ఉదయం 8 గంటలకు మహిళలు బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. అనంతరం అమ్మవారిలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

ప్రజాసేవకే పునరంకితం

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం పాపంపేట వలంటీరు పాదరాళ్ల జయంతి సేవాభావంతో సేవలు అందిస్తున్నారు. కరోనా సమయంలో ఈమె అందించిన సేవలు ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరు. ఇళ్ల నుంచి ఎవరూ ధైర్యంగా బయటకు వచ్చేందుకు సాహసించలేదు. ఇలాంటి పరిస్థితుల్లో నిత్యావసర వస్తువులు, రోజువారి అవసరమైన సరుకులు కావాల్సి వచ్చినప్పుడు వలంటీర్‌కు ఫోన్ చేసి, ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపి తెప్పించుకున్నారు. వలంటీర్ ప్రాణాలకు తెగించి ఈమె పరిధిలోని ప్రజలకు సేవలు అందించారు. ఈమె సాహసాన్ని స్థానిక ప్రజలు కూడా మెచ్చుకుంటున్నారు. కరోనా వ్యాక్సిన్లు ముందుగా వేయించుకున్న వలంటీర్లు.. ప్రభుత్వ భరోసాతో సాహసోపేతంగా సేవలందించారని చెబుతున్నారు. ఏ సమయంలో ఫోన్లు చేసినా వెంటనే స్పందిస్తున్న వలంటీర్ల సేవలను ఎప్పటికీ మరువలేమని పాపంపేట వాసులు చెప్పున్నారు.



వృద్ధురాలికి పింఛన్ సొమ్ము అందిస్తున్న వలంటీరు పాదరాళ్ల జయంతి

వలంటీర్లకు వందనం

పిలిచిని వెంటనే స్పందిస్తుంది..



మా వలంటీరు జయంతికి ఏ సమయంలో ఫోన్ చేసినా వెంటనే స్పందిస్తోంది. పింఛన్ ఇచ్చే రోజైతే తెలవారకనే మా వీధిలోని పింఛన్‌దారులకు డబ్బులు పంచుతోంది. కరోనా సమయంలో మేమంతా ఇళ్లకే పరిమితమైనా ఏ చిన్న అవసరం వచ్చి వలంటీరుకు చెప్పినా ఇంటికే చేర్చేది. ప్రభుత్వం నుంచి ఏ పని కావాలన్నా.. వలంటీరుకే చెబుతున్నాం. వలంటీరును మా కుటుంబ సభ్యురాలిగా భావించాం.

– పి.అనిత
పాపంపేట, అనంతపురం రూరల్

వస్తు ఉత్పత్తి రంగానిదే భవిష్యత్తు



మాట్లాడుతున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి

అనంతపురం: భవిష్యత్తు వస్తు ఉత్పత్తి రంగానిదేనని, ఈ నేపథ్యంలో బీటెక్ విద్యార్థులకు కోర్ సబ్జెక్టులపై పూర్తి స్థాయి శిక్షణ ఇవ్వాలని జేఎన్‌టీయూ అధ్యాపకులకు ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి సూచించారు. కోర్ సబ్జెక్ట్‌పై జేఎన్‌టీయూ (ఏ) క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకులతో సోమవారం ఆయన సమీక్షించారు. ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ ఇవ్వాలన్నారు. ప్రతి విద్యార్థిలోనూ భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు పెంపొందించాలన్నారు. ముఖ్యంగా అధ్యాపకులు ఎప్పటికప్పుడు నూతన అంశాలపై అధ్యయనం చేయాలన్నారు. వర్సిటీ బోధన సిబ్బంది తమ అర్జిత సెలవులను నగదుగా మార్చుకునేందుకు, గత సర్వీసును పదోన్నతులకు పరిగణించడం వంటి అంశాలపై జీఓ నెంబర్ 20ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్ధన మాట్లాడుతూ... గత సర్వీసును పదోన్నతులకు పరిగణించేలా జీఓ నెంబర్ 20ను విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. అధ్యాపకులకు ఎంతో ప్రయోజనకరమైన అంశాన్ని అమలు చేసినందుకు ఉన్నత విద్యామండలి చైర్మన్ కృషి ప్రశంసనీయమన్నారు. అనంతరం హేమచంద్రారెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దూదేకులకూ షాదీ తోఫా జగనన్న ఘనతే

అనంతపురం సిటీ: ముస్లిం మైనార్టీ అమ్మాయిలకు షాదీ తోఫా కింద ప్రభుత్వం ఇచ్చే రూ.లక్ష మొత్తాన్ని ఇక నుంచి దూదేకులకూ ఇవ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడం ఆనందంగా ఉందని మేయర్ వసీం, ఉర్దూ అకాడమీ చైర్మన్ హిరియల్ నదీం , వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా బేగ్ అన్నారు. స్థానిక కళ్యాణదుర్గం రోడ్డులోని ఎన్‌ఆర్ కాలనీలో గల మసీద్-ఏ-జిక్రియా మసీదులో 'హర్ దిల్ మే వైఎస్సార్-హమ్ సబ్ జగన్‌కే సాత్' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే రూ.50 వేల నుంచి రూ.లక్షకు జగనన్న షాదీ తోఫా మొత్తాన్ని పెంచి ముస్లిం అమ్మాయిల జీవితాల్లో వైఎస్ జగన్ వెలుగు నింపారన్నారు. ఇప్పటికే ముస్లిం మైనార్టీల కోసం ఎన్నో రకాల సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు చేస్తున్న వైఎస్ జగన్.. మరో అడుగు ముందుకేసి..దూదేకులు, ఉప కులాల అమ్మాయిల పెళ్లిళ్లకూ ఇచ్చే మొత్తాన్ని రెట్టింపు చేయడం ఆనందంగా ఉందన్నారు. అధికార కాంక్షతో జగన్ నుంచి ముస్లిం, దూదేకులను దూరం చేయాలని చూస్తున్న చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడ్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని వారు ముస్లింమైనార్టీలను కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వేముల నదీమ్, ఖాజా, షెక్షావలి, ఖాదర్‌బాషా, మసీదు ఇమామ్ నజీర్ సాబ్, మసీదు కమిటీ సభ్యులు చాంద్‌బాషా, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్లు విడుదల చేస్తున్న వసీం, నదీమ్, రిజ్వాన్, సైఫుల్లా తదితరులు

శివారు కాలనీలకు ఆకతాయిల బెడద

రాప్తాడురూరల్: నగర శివారు కాలనీల్లో ఆకతాయిల బెడద అధికమైంది. రోడ్డు పక్కనున్న చెట్ల కింద గుంపులుగా కూర్చొని పేకాట, డప్ ఆట ఆడుతున్నారు. దీనికితోడు చిన్నచిన్న దొంగతనాలు తరచూ జరుగుతున్నాయి. పదిరోజుల కిందట బీజేపీ కొట్టాలులో చిత్రా నారాయణస్వామి ఇంటి ఆవరణలో ఉన్న రూ. 15 వేలు విలువ చేసే మేకపోతు ఎత్తుకెళ్లారు. కక్కలపల్లి సర్పంచ్ కృష్ణయ్య తోటలో 150 మీటర్ల మోటారు వైరు ఎత్తుకెళ్లారు. వారం రోజుల కిందట కక్కలపల్లి నుంచి ఆలమూరుకు వెళ్లేదారిలో ఉన్న ఆదినారాయణ తోటలో మోటారు స్టార్టర్ పెట్టెను ఎత్తుకెళ్లారు. ఇటీవల రాత్రి 11.30 గంటల సమయంలో ఆలమూరుకు వెళ్లే దారిలో నలుగురు ఆకతాయిలను పోలీసులు అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. సిండికేట్‌నగర్ నుంచి ఆటోకాలనీకి వెళ్లేదారిలోనూ, రాచానపల్లి నుంచి దర్గా కొట్టాలు, కొడిమికి వెళ్లేదారిలోనూ ఆకతాయిల బెడద ఉంది. అలాగే కొందరు యువతీయువకులు జంటలుగా ముళ్లపొదల్లోకి వస్తున్నారని స్థానిక కాలనీ ప్రజలు చెబుతున్నారు.



పొలంలో ఎత్తుకెళ్లిన స్టార్టర్ పెట్టె స్థానంలో కొత్తది ఏర్పాటు చేసుకున్న దృశ్యం

నగరాభివృద్ధికి పటిష్ట చర్యలు

అనంతపురం క్రైం: ప్రభుత్వం నగరాభివృద్ధి కోసం పటిష్ట చర్యలు తీసుకుంటోందని మేయర్ వసీం పేర్కొన్నారు. సోమవారం నగరంలోని 43వ డివిజన్‌లోని 62వ సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని అదనపు కమిషనర్ రమణారెడ్డితో కలసి మేయర్ స్థానిక ప్రజలకు వివరించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం ద్వారా అందించే 11 రకాల సర్టిఫికెట్లు, ఆ సర్టిఫికెట్లతో అర్హత లభించే పథకాలపై తెలియజేశారు. అమ్మఒడి, చేయూత, విద్యా, వసతి దీవెన, సొంతిళ్లు, పింఛన్, తదితర పథకాలకు అర్హత లభిస్తుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముందుచూపుతో తీసుకున్న గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదనపు కమిషనర్ రమణారెడ్డి మాట్లాడుతూ సర్టిఫికెట్లతో పాటు ఇతర సమస్యలను 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ద్వారా తెలియజేద్దామన్నారు. మేయర్ వెంట కార్పొరేటర్లు ఇసాక్, కమల్‌భూషణ్, అనిల్‌కుమార్ రెడ్డి, నాయకుడు కిశోర్, తదితరులు పాల్గొన్నారు.



జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న మేయర్ వసీం

ఓటర్ల సర్వేకు సహకరించండి

కనగానపల్లి: గ్రామాల్లో చేపట్టే ఇంటింటా ఓటర్ల సర్వేకు అందరూ సహకరించాలని తహసీల్దార్ రమాదేవి రాజకీయ పార్టీల నాయకులకు సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె ఈ నెల 21 నుంచి గ్రామాల్లో చేపట్టే ఇంటింటా ఓటర్ల సర్వే కార్యక్రమంపై పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల సర్వే కార్యక్రమం షెడ్యూల్, నిబంధనలపై తహసీల్దార్ వివరించారు.

సిరిసంపదల శ్రావణం

- అధిక మాసంతో శుభ ముహూర్తాలు దూరం
- ఆగస్టు 17 నుంచి నిజ శ్రావణం

అనంతపురం కల్చరల్: సోమవారం వచ్చిన అమావాస్యతో ఆషాఢ మాసం ముగిసి శ్రావణం ప్రారంభమవుతోంది. శ్రావణం శుభకరమని, సిరిసంపదలను ఒసగే పర్వ దినాలను మోసుకోచ్చే ఈ పవిత్ర మాసం కోసం అందరూ ఎదురు చూస్తుండడం పరిపాటి. ఇరవై ఏళ్ల తర్వాత వచ్చిన అధిక శ్రావణం కావడంతో ఈ నెలలో ఎలాంటి శుభకార్యాలు నిర్వహించుకోకూడదని శాస్త్రం చెబుతోందని పండితులంటున్నారు. శూన్య మాసం కావడంతో కేవలం ప్రత్యేక పూజలు, హోమాలతో పాటు పితృ సంబంధమైన కార్యక్రమాలు మాత్రమే జరుగుతాయి. ఈ మాసం జూలై 18 నుంచి ఆగస్టు 16 వరకు ఉంటుంది. ఈ నెలలో జిల్లా వ్యాప్తంగా ఆలయాలలో ఏకాదశి ఉపవాస వ్రతాలు, దీక్షలు, దానధర్మాలు అధికంగా జరగనున్నాయి. మళ్లీ ఆగస్టు 17 నుంచి సెప్టెంబరు 15 వరకు ఉండే నిజ శ్రావణంలోనే అందరూ ఎదురు చూసే పండుగలు, వ్రతాలు రానున్నాయి.



అధిక శ్రావణంలో పూజలందుకునే మహాశివుడు

దైవారాధనకు అత్యుత్తమ మార్గం



హంగులు, ఆర్భాటాలతో సాగే పూజలు, వ్రతాలకు కాసింత విరామమిస్తూ, మానసిక ప్రశాంతత కలుగజేసేందుకే అధిక మాసాలు వస్తుంటాయి. రెండు దశాబ్దాల తర్వాత వచ్చిన ఈ అధిక శ్రావణ మాసంలో దైవారాధన, పితృ కార్యక్రమాలు చేస్తే ఎంతో మంచిదని శాస్త్రం చెబుతోంది. కేవలం భగవంతుడిని స్మరిస్తూ ఉండడాలన్నది ఈ మాసం చెప్పే విశిష్టత. ఈ నెల 17న రాత్రి నుంచి వచ్చే నెల 16 వరకు ఉండే అధిక శ్రావణంలో గీతామందిరంలో ప్రత్యేక పూజలు జరుగనున్నాయి.

– భరత్‌శర్మ, పురోహితులు, గీతామందిరం, అనంతపురం

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

రాప్తాడు: మండల పరిధిలోని బుక్కచెర్లకు చెందిన మలోబులేసు అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద మృతుడి కుమారులు మనోహర్, మధులకు సర్పంచు ఆదినారాయణమ్మ, వెల్ఫేర్ అసిస్టెంట్ కేవీ తనూజా, పంచాయతీ కార్యదర్శి నవీన్ సోమవారం రూ.10 వేలు అందించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం శ్రీలత, వలంటీరు నరేంద్ర రెడ్డి, సచివాలయ కన్వీనర్ గుర్నాథ రెడ్డి, నాయకులు చిన్న రెడ్డి పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండల కేంద్రానికి చెందిన బ్రహ్మయ్య (47) రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. ఎంపీపీ హేమలత, పంచాయతీ సెక్రటరీ శైలజారాణి ఆధ్వర్యంలో బ్రహ్మయ్య భార్య బిల్లే లక్ష్మిదేవికి వైఎస్సార్ బీమా తక్షణ సహాయం కింద రూ.10 వేలు సోమవారం అందించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ కన్వీనర్లు వెంకటేష్, శ్రీరామ్, సచివాలయ ఉద్యోగస్తులు భానుప్రకాష్, వెంకటేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు వన్నూరప్ప, వెంకట్రామిరెడ్డి, రాజశేఖర్, వలెంటీర్లు అశోక్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన బీర పంట



రాప్తాడు: మండలంలోని అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన ఆవుల ఎర్రిస్వామి, ఆవుల పరంధామలు సాగు చేసిన బీర పంట సోమవారం మధ్యాహ్నం గాలీవాన బీభత్సానికి నేలకొరిగింది. ఐదెకరాల్లో సాగు చేసిన బీర పంట కోతకు వచ్చిందని, ఇటీవల దాదాపుగా 30 బాక్సుల వరకు మార్కెట్‌కు తరలించారు. గాలి, వాన బీభత్సావానికి 3 ఎకరాల్లో బీర పంట నేలవాలింది. దీంతో బాధిత రైతులకు రూ.10 లక్షలు వరకు నష్టం వాటిల్లిందని తెలిపారు.

మహిళా రైతు ఆత్మహత్య

కనగానపల్లి: మండలంలోని పాతపాళ్యం గ్రామంలో మహిళా రైతు జీ శ్రావణి (32) పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన మేరకు.. పాతపాళ్యం గ్రామానికి చెందిన జీ సుధీర్‌రెడ్డి, అతని భార్య శ్రావణి వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. తగరకుంట గ్రామ రెవెన్యూ పరిధిలో వీరికి ఉన్న 9.5 ఎకరాల పొలం ఉండగా, వ్యవసాయం కోసం మూడు బోర్లు తవ్వారు. బయట వ్యక్తుల వద్ద రూ.8 లక్షల దాకా అప్పు చేశారు. దీంతో పాటు వేరుశనగ పంట సాగు కోసం బ్యాంకుల్లో మరో రూ. 2 లక్షలు అప్పు చేశారు. పంట సాగుచేసిన తర్వాత బోరుబావుల్లో నీరు తగ్గిపోవటంతో పాటు, సకాలంలో వర్షాలు కురవకపోవటంతో పంటంతా ఎండుముఖం పట్టింది. అప్పులు తీర్చేమార్గంలేక శ్రావణి రోజూ మదనపడుతుండేది. ఆదివారం రాత్రి ఇంట్లో ఉన్న పురుగు మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందింది. మృతురాలుకు భర్త సుధీర్‌రెడ్డితో పాటు ఒక కొడుకు, కూతురు ఉన్నారు. దీనిపై కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

ఆర్థిక అక్షరాస్యత అత్యంత కీలకం



మాట్లాడుతున్న ట్రెల్లిస్ స్కూల్ చైర్మన్ శ్రీకాంత్

రాప్తాడురూరల్: నేటి ఆధునిక సమాజంలో, డబ్బు విలువ, ఆర్థిక అక్షరాస్యతపై పిల్లలకు అవగాహన కల్పించడం చాలా ముఖ్యమని అనంతపురం నగరంలోని ట్రెల్లిస్ స్కూల్ చైర్మన్ శ్రీకాంత్ వద్ద పేర్కొన్నారు. సోమవారం స్కూల్‌లో ఫిల్స్ (ఫైనాన్షియల్ లిట్రసీ లెర్నింగ్ సెషన్)ను ప్రవేశపెట్టారు. అందులో భాగంగా ఆర్థిక అక్షరాస్యత, డబ్బు విలువ పాముఖ్యతను తెలియజేశారు. చెప్పులు కుడుతూ జీవనం సాగించే కుళ్లాయప్ప, రామదాసు పాదరక్షల మరమ్మతులకు ధరలు, వారి రోజువారీ ఆదాయం, ఖర్చుల నియంత్రణ వంటి అంశాలపై చర్చించి, ప్రతి రూపాయి వెనుక వారి కష్టాన్ని తెలియజేశారు. డబ్బును ఎలా సంపాదిస్తారు, ఆర్థిక బాధ్యత ప్రాముఖ్యతపై వారి అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ అనిల్ తేజ, కోశాధికారి నందిని, ప్రధానోపాధ్యాయురాలు భార్గవి, పాఠశాల సిబ్బంది, పాల్గొన్నారు.

వేరుశనగలో సస్యరక్షణ తప్పనిసరి

- అనంతపురం ఏడీఏ ఎం.రవి

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ పంట కింద జూన్ ఆఖరు, జూలై ప్రారంభంలో సాగు చేసిన వేరుశనగ ప్రస్తుతం 15 నుంచి 30 రోజుల దశలో ఉందని, సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడి సాధించొచ్చని అనంతపురం వ్యవసాయశాఖ సబ్ డివిజన్ ఏడీఏ ఎం.రవి తెలిపారు. సోమవారం ఆయన ఏవోలతో కలిసి అనంతపురం, కూడేరు, గార్లదిన్నె మండలాల్లో పర్యటించి, వేరుశనగ పంట పొలాలను పరిశీలించారు. డివిజన్ పరిధికి సంబంధించి ప్రస్తుతానికి అనంతపురం మండలంలో 1,145 హెక్టార్లు, ఆత్మకూరులో 2.186 హెక్టార్లు, బుక్కరాయసముద్రంలో 1,852 హెక్టార్లు, గార్లదిన్నెలో 122 హెక్టార్లు, రాప్తాడులో 1,851 హెక్టార్లు, కూడేరులో 456 హెక్టార్ల విస్తీర్ణంలో రైతులు వేరుశనగ సాగు అయినట్లు తెలిపారు. పంట పొలాల పరిశీలనలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులను చూస్తే అక్కడక్కడ ఆకుముడుత, వేరు తొలుచు పురుగు, కాండం తొలుచు పురుగు, పొగాకు లద్దె పురుగు, రసంపీల్చు పురుగు లాంటివి ఆశించే అవకాశం ఉందన్నారు.

ఆకుముడత నివారించుకోవాలి..

ఆకుముడత నివారణకు 2 మి.లీ క్వినాల్‌ఫాస్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని ఏడీఏ తెలిపారు. ఎకరాకు నాలుగు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కాండం తొలుచు పురుగు నివారణకు ఎకరాకు 10 కిలోలు కార్బోఫ్యూరాన్ గుళికలు చల్లుకోవాలన్నారు. పొగాకులద్దె పురుగు నివారనకు 1.20 మి.లీ ఎమామెక్టిన్ బెంజోయేట్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలనారు. రసంపీల్చు పురుగులు, తేనెబంక నివారణకు 1.5 గ్రాములు అసిఫేట్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. జింక్, బోరాన్, ఇనుము ధాతువుల లోప నివారణకు ఎప్పటికప్పుడు మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే పంట దిగుబడులకు ఢోకా ఉండదని తెలిపారు.



ఇటుకులపల్లిలో వేరుశనగ పొలంలో రైతులకు సూచనలు చేస్తున్న ఏడీఏ ఎం.రవి, ఏవో శశికళ

ప్రజలకు ఇబ్బందులు కలగనీయొద్దు

- నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి

అనంతపురం క్రైం: ప్రజలకు, ఆస్పత్రికి వచ్చే రోగులకు ఇబ్బందులు కలగనీయొద్దని, ట్రాఫిక్ సమస్య తలెత్తనీయొద్దని ఆస్పత్రి సమీపంలో దుకాణాలు, క్యాంటీన్లు, మొబైల్ క్యాంటీన్లు ఏర్పాటు చేసుకున్న వ్యాపారులు, అంబులెన్స్ డ్రైవర్లకు నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి సూచించారు. కలెక్టర్ గౌతమి ఆదేశాలు, సర్వజనాస్పత్రి అధికారుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వ సర్వజనాస్పత్రి ముందు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్న తోపుడు బండ్లు, మొబైల్ క్యాంటీన్లు, అంబులెన్స్‌లు తొలగించేలా కమిషనర్ చర్యలు తీసుకున్నారు. ఆ ప్రాంతంలో మొక్కలు నాటించేలా చర్యలు తీసుకున్నారు. తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని కొందరు వ్యాపారులు కమిషనర్‌కు విన్నవించారు. వీరంతా స్ట్రీట్ వెండర్ కార్డులు ఎందుకు తీసుకోలేదని వ్యాపారులను కమిషనర్ ప్రశ్నించారు. రోగుల ప్రాణాల దృష్ట్యా ఆస్పత్రి ముందు వ్యాపారాలు నిర్వహించకూడదని చెప్పారు. త్వరలో పోలీసులతో సమావేశం ఏర్పాటు చేసి స్ట్రీట్ వెండర్ కార్డులు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రి ముందు అంబులెన్స్‌లను ఉంచకుండా చర్యలు తీసుకోవాలని ఏసీపీ బాలాజీని కమిషనర్ భాగ్యలక్ష్మి ఆదేశించారు. రాంనగర్ ఫ్లై ఓవర్ కింద వైపు వాహనాలు ఉంచేలా చూడాలన్నారు.



వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్ భాగ్యలక్ష్మి

నేత్రపర్వం..చౌడేశ్వరి జయంత్యుత్సవం





బోనాలు ఎత్తుకెళ్తున్న మహిళలు, వడియం పేటలో అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పూజలందుకునే చౌడేశ్వరీమాత జయంత్యుత్సవాలు సోమవారం పలుప్రాంతాల్లో నేత్రపర్వంగా జరిగాయి. ఆషాఢ అమావాస్య సందర్భంగా వచ్చే అమ్మవారి జయంతి సందర్భంగా గుత్తిరోడ్డులోని చౌడేశ్వరీమాత ఆలయంలో ఉదయం మహిళలు ఉత్సవంగా నగరవీధుల గుండా బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా ఆటపాటలతో వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని ఆలయ కమిటీ నిర్వాహకులు దాసరి శ్రీధర్,చిదంబరయ్య,చింతా వేంకటేశ్వర్లు, చౌడయ్య తదితరులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు వెంకటేశులు, సంజీవయ్య, శ్రీనివాసులు, కుమార స్వామి తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. వడియంపేట చౌడేశ్వరి అమ్మవారి జయంతి వేడుకల్లో తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బండి శ్రీనివాసులు, సెక్రటరీ కృష్ణమూర్తి, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సాయిప్రసాద్, జాయింట్ సెక్రటరీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు. బెంగళూరు రోడ్డులోని చౌడేశ్వరీమాత కల్యాణ మండపంలో అమ్మవారి జయంతి వేడుకలు జరిగాయి. అమ్మవారికి అలంకార సేవలు, అన్నదానం నిర్వహించారు. మొదటిరోడ్డులోని చౌడేశ్వరి ఆలయంలో పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం పంచామృతాభిషేకాలు, అలంకార సేవలు, సాయంత్రం నగరోత్సవం జరిగాయి.